# అత్తగారూ- కూర్మావతారం



అప్పుడే వచ్చిన పోస్టు ఒక్కొక్క కవరూ చించి చూస్తున్న నన్ను మా అత్తగారడిగారు—— "నాగపూరు నుంచి వెంకటేశంగాడి వుత్తరం ఏమైనా వచ్చిందంటే? పరీక్షలవుతూనే వస్తానన్నాడు. రమ్మని మనం వ్రాసికూడా నాలుగు రోజులయింది. ఆ పిఠాపురం వాండ్లు పిల్లను చూడ్డానికి రమ్మని నిన్న కూడా వుత్తరం వ్రాసినట్లున్నారు. పరీక్ష లయ్యాక కూడా వాడికక్కడేం పనిటా!" అంటూ నన్ను నిలదీశారు. వెంకటేశం మా అత్తగారి అక్క మనవడు. వాడి చిన్నప్పుడే తండ్రి పోయినందువల్ల గుండె జబ్బుతోనూ, బ్లడ్ ప్రెషర్‌తోనూ బాధపడే తల్లితోసహా పల్లె విడిచి చదువుకోసం పట్నం వచ్చి మా యింట్లోనే వుంటూ మా అత్తగారికి అభిమాన పాత్రుడయాడు. యం. ఏ చదువుదానికి పట్నంలో సీటు దొరక్క నాగపూరు వెళ్ళి ఫైనల్ యియర్ పరీక్షలు వ్రాసి వస్తూన్నాడంటే అదంతా తన ప్రతిభే అని మురిసిపోయారు మా అత్తగారు.

వెంకటేశం పెండ్లి మా అత్తగారి ఆధ్వర్యంలోనే నడిపించాలని జబ్బుతో మంచంలో వుండే వెంకటేశం తల్లి తీర్మానించింది. వెంకటేశానికి వచ్చిన సంబంధాలలో మా అత్తగారికి ఏదినచ్చితే అదే చేయాలని ఆమె సంకల్పం. వచ్చిన సంబంధాలన్నిటిలోనూ పిఠాపురంవాండ్ల పిల్ల సంబంధమే నచ్చింది మా అత్తగారికి. ఆ పిల్ల తల్లిదండ్రులు మా అత్తగారి పుట్టింటివైపు వాండ్లు. ఆ పిల్లను చూట్టానికే వెంకటేశాన్ని పరీక్ష లయిన వెంటనే బయలుదేరి రమ్మని పుత్తరం వ్రాశారు. దానికి వెంకటేశం తనకు వుద్యోగం దొరికిందాకా వివాహ ప్రయత్నాలు చేయవద్దని జవాబు రాశాడు.

"టట్! అదంతా వీల్లేదు, వుద్యోగంపాటికి వుద్యోగం, పెళ్ళిపాటికి పెళ్ళి! మా కాలంలో వుద్యోగం కోసం మగవాళ్ళు పెళ్ళిళ్ళు మానేశారా? నా కిద్దరు పిల్లలు పుట్టాకనేగా మా వారికుద్యోగం వచ్చింది! అదీ మానాన్న గారి సిఫారసుమీదే దొరికింది. అట్లాగే రేపు నీకు పిల్లనిచ్చేవాడే వుద్యోగం చూసి పెడ్తాడు. ఎవరికోసం? నారుపోసినవాడు నీరు పోయడా ఏమిటి! పిచ్చి పిచ్చి వేషా లెయ్యక పిల్లను చూట్టాని కెప్పు డొచ్చేదీ ఉత్తరం వ్రాయి. నీ రోగిష్ఠి తల్లికి వుపచారం చేయటానికైనా నీవు వెంటనే పెళ్ళి చేసుకోక తప్పదు!" అని గట్టిగా చీవాట్లేస్తూ వెంకటేశానికి మా అత్తగారు ఉత్తరం వ్రాసికూడ నాలుగురోజు లయింది....అవి డడిగినట్లే పెండ్లి పత్రికల మధ్య వెంకటేశం వ్రాసిన కవరు కనిపించింది. మాట్లాడకుండా కవరు ఆమె చేతి కిచ్చాను.

"నా చేతి కిస్తావేంటి! వాడు ఇంగ్లీషులో వ్రాసే ఉత్తరం నే నెట్టా చదివేది? నీవే చదివి, ఏం రాశాడో చెప్పు, చాలు!'' అన్నారు. ఆ మాట అనిపించుకొని చదవడం మంచిదని నా తిప్పలు

ఎప్పుడూ ఇంగ్లీషులో, మా వారి పేరుతో వ్రాస్తూండే వెంకటేశం ఉత్తరం యీ సారి తెలుగు అక్షరాలతో వింతగా కనుపించింది.

''గంభారధీ అమ్మమ్మగారికి, మల అమ్మకు నమస్కారములు''

—పక్కున నవ్వారు మా అత్తగారు.

''ఓరి అప్రాచ్యుడా! గంభారధీ అమ్మమ్మ ఏమిటీ! మల అమ్మ ఏమిట్రా? గంగాభాగీరథీ సమానురాలు. మహాలక్ష్మీ సమానురాలుకు వచ్చిన తిప్పలా? సమానురాలను సంతకు పంపాడే! వీడి తెలుగింకా బాగు పళ్ళే దన్నమాట! సరే, ముందుకు చదువు" అన్నారు.

"ఇచ్చట నా శరీరం బాగుంది. అచ్చట మీ శరీరాలు". మర శ్రీ మామగారి శరీరం బాగుండాలి".

మళ్ళీ విరగబడి నవ్వారు మా అత్తగారు. ''మరశ్రీ మామగారేమిటీ? ఈ శరీరాలేమిటీ! ఆరోగ్యాన్ని అడవులు పట్టించాడే!''

"నా పరీక్ష లయిపోయాయి. ఈ వారంలో అక్కడకు వస్తాను. అమ్మమ్మకూడా వస్తేనే పిల్లచూపులకు వెళ్తాను."

ఫక్కున నవ్వారు మళ్ళీ మా అత్తగారు.

"పిల్లచూపులేమిటి! పెండ్లిచూపులుకదూ! పైగా నన్ను రమ్మంటూ డేమిటి, కూడా! ఇంకా ఏం రాశా డేమిటి!" అన్నారు.

"చిరంజీవి అత్తగారికి నమస్కారములు, అల్లుడిని అడిగాననుడు. పిల్లను నేను చూసి, నేనూ పిల్లా సంప్రదించుకొన్న తర్వాతనే పెళ్ళి.... పిల్లమనసు నాకూ, నా మనసు పిల్లకూ...."

ఇక చదవడం నావల్ల కాలేదు. ఆమెచేతి కిచ్చేశాను. మా అత్తగారూ మూతికి కొంగు అడ్డుంచుకొని నవ్వారు కాసేపు.

వెంకటేశం ఊరునించి వస్తూనే తిథి, వారం, నక్షత్రం, తారాబలం, చంద్రబలం, రాహుకాలం, వర్జ్యం, గుళిక, యమగండం, యోగం అన్నీ స్వయంగా పంచాంగంలో చూసి, మర్నాడే బాగుందని తీర్మానించారు మా అత్తగారు. తనొక్కడే వెళ్ళనన్నాడు వెంకటేశం. వెంకటేశం తల్లి కూడ మా అత్తగారినే, కూడా రమ్మని, పట్టుబట్టింది. విధిలేక మా అత్తగారే వెంకటేశంతో పెండ్లిచూపులకు వెళ్ళటానికి నిశ్చయించుకొన్నారు.

బయల్దేరే ముందు "శకునం విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలేం" అంటూ నన్ను హెచ్చరించారు మా అత్తగారు. ఇంట్లో పనిచేసే విధవావిడ ఆ సమయానికి సరిగా ఎదురురాకుండా చూడాల్సిన బాధ్యత నామీద వుంచారు. అంతే కాకుండా "పక్కింటి పార్వతమ్మగార్ని నేను రమ్మన్నానని కబురుపెట్టవే! మేం బయల్దేరే సమయానికి ఎదురొచ్చినట్టూ వుంటుంది, నే వెళ్తొస్తానని చెప్పినట్టూ అవుతుంది— పండులాంటి ముత్తైదువ!" అన్నారు. సరిగ్గా మా అత్తగారు బయల్దేరే సమయానికి పార్వతమ్మగారికి కబురుపెట్టాను, మా అత్తగారు అర్జంటుగా రమ్మంటున్నారని. పార్వతమ్మ శకునంకోసం మా అత్తగారు వెంకటేశాన్ని హడా

పిలిచి పెట్టి కారులో కూచోబెట్టారు. అందరికీ 'వెళ్ళొస్తా'నని చెప్పారు. పిల్లను చూసి అన్ని వివరాలూ వెంటనే జాబు వ్రాస్తానని చెప్పారు.

కారు బయలుదేరి గేటుదాకా వెళ్ళింది. పార్వతమ్మకోసం తొంగి చూశారు మా అత్తగారు-మంచి పట్టెనామాలతో, చేతిలో కూరల సంచీతో సహా మా వంటాచార్యులు ఎదురయ్యాడు. ఆ సమయంలో మా అత్తగారి అవస్థ ఎలావుందో తెలియలేదు కాని కారుమాత్రం తక్షణం వెనక్కు తిప్పిస్తా రనుకున్నాను. కాని ఆచార్లవెనకనే పార్వతమ్మగారు కూడా ఎదురయ్యారు. ఆచార్లు పిల్లిలాగా మా అత్తగారి ఎదుట బడకుండా జారుకున్నాడు. కారు నిలిపి, పార్వతమ్మతో 'వెళ్ళొస్తా'నని చెప్పి "కాస్తముందు రాకపోయావా!" అంటూ సణిగారు మా అత్తగారు. ఇంక తను, మరీ, శకునం చూస్తూవుంటే వెంకటేశం బుద్ధి మారుతుందేమో నని స్టేషన్‌కు వెళ్ళారేకాని లేకపోతే తక్షణం కారు దిగి కాళ్ళు కడుక్కొని ఆ రోజుకు ప్రయాణం మానేసేవారే!

మా అత్తగారి ఉత్తరంకోసం ఎదురుచూశాం. మూడోరోజు వచ్చింది.మా అత్తగారి స్వహస్తాలతో వ్రాసినఉత్తరం. "చి॥సౌ॥ కుమార్తెను చి॥సౌ॥ కోడలిని ఆశీర్వదించి ఉ॥త॥ మనవాండ్లింట్లోనే దిగాము. నన్ను చూసి వాండ్లందరికి ప్రాణాలు లేచొచ్చాయి. నిన్ననే పిల్లను చూసివచ్చాము. పిల్లావాండ్ల యిల్లు కాస్త ఫాషన్‌గానే వుంది బయటినుంచి. తీరా లోపల కెళ్ళి చూస్తే యిల్లు శుభ్రంగా లేదమ్మా! ఎక్కడివస్తువు అక్కడే పడి వున్నాయి. ఇల్లంతా చూశాక యిల్లాలిని చూశాను. ఆ యిల్లాలు కదిలేస్థితిలో లేదు, పాపం! అంటే జబ్బుకాదు. ఓ పెద్ద పీపాకిమల్లే పై నుంచి కిందకి ఒకేలావు. అవిడ యింటిపనులు ఎన్నడూ చేసినట్లులేదు. ఇంటి యజమానే ఎదురొచ్చి మమ్మల్ని లోపలికి పిల్చుకెళ్ళి కూచోబెట్టి చాలా మర్యాదచేశాడు. కాని ఆయన అవస్థకూడా అదే! గంటకొక అడుగువేస్తూ, అతి నిదానంగా నడుస్తాడు. వల్లమాలిన పొట్ట, పైగా పొట్టి. మన వంటింటి దగ్గ రుండే పెద్ద గంగాళంలా వున్నాడు, పాపం! వీరిద్దరినీ చూసి నాకు కాస్త గాభరా కలిగింది. పిచ్చాపాటి మాట్లాడినతర్వాత 'పిల్ల లెంద'రని అడిగాను. 'ఒక్క

కుమారుడు, ఒక్క కుమార్తె' అని, పిల్లవాడు పక్కగదిలో వుంటే పిలిచాడు తండ్రి. ఒక గున్నఏనుగులా గున్నాడు పిల్లవాడు. అతన్నిచూసి వెంకటేశం నా వైపు చూసి గుడ్లు తేలవేశాడు. 'మా అమ్మాయి' అంటూ వాళ్ళమ్మ మరో లావుపాటి శరీరాన్ని యింకో గదిలోంచి లాక్కొచ్చింది. పిల్లను తీసికొచ్చి ఎదురుగా చాపమీద కూర్చోపెట్టారు. సోఫాలో కూర్చున్న వెంకటేశం కెవ్వున కేకవేసి ఎగిరి అవతలపడ్డాడు. అంతా ఒక్కసారి కంగారు పడిపోయారు—'పిల్లను చూసి యిట్లా అదురుతున్నా డేమిట్రా' అని. ముచ్చెమటలు పోసి గుమ్మంలో నుంచుతున్న వెంకటేశం దగ్గరకెళ్ళి 'ఏమైందిరా?' అన్నాను, రహస్యంగా. సోఫాక్రింద చూపించాడు. నాకేమీ కనుపించలా! వాళ్ళంతా ఒక్కసారి ఘొల్లున నవ్వారు. దగ్గరకువెళ్ళి చూశాను. పిల్ల ముద్దుగా పెంచుతున్న మట్టతాబేలట. మెల్లగా వచ్చి వెంకటేశం కాలి బొటనవేలు కసిక్కున కొరికింది. అసలే మనవాడికి పాకే జంతువులంటే పల్లమాలిన భయమూ, చీదర! పైగా ఎప్పుడూ దాని నివాసము ఆ సోఫాలోనేనట. మనవాడు కూచోడం దానికి సరిపోలేదు కామోసు! అదింకా పిల్లతాబేలేనట. పెద్దదయితే పిల్ల తల్లంత అయ్యేట్టుంది, దాని వాలకం చూస్తే. తాబేళ్ళు బావుల్లో వుంటం చూశాం కాని, యిట్లా యిళ్ళల్లో పెంచుకోవడం ఎప్పుడూ నే చూళ్ళా! వెంకటేశాన్ని ఉయ్యాల బల్లమీద, కాళ్ళు పైకి పెట్టుకొని కూచోమన్నాను.

"అయ్యో! అదేం చేయదండీ అదంటే అమ్మాయికి ప్రాణం—అమ్మాయన్నా దానికీ అంతే—అమ్మాయిని వదిలి అది ఒక్కక్షణం వుండదు— అమ్మాయి ఎలా చెపితే అలా వింటుంది. అది ఏ భాషలో మాట్లాడినా దాని కిట్టే అర్థమౌతుంది—మీకు కొత్త గనుక అలా వుంది—పిలువమ్మా దాన్ని" అంది కూతురుతో, ముద్దుగా. పిల్ల దాన్ని 'కూనలమ్మా' అంటూ పిలిచింది. అది గునగున పాకుతూ పిల్లవేపు వెళ్ళింది. కొద్దిసేపయాక పిల్లపాడటం మొదలెట్టింది. వెనకనించి నా గోచీ ఎవరో లాగినట్లయింది. ఉలిక్కిపడి తిరిగి చూస్తే ఆ తాబేలే. నా గోచీ పట్టుకుంది. ఒళ్ళు జలదరించింది. 'ఏమిటీ పీడ' అని మనసులోనే అనుకొని, మర్యాదకు పైకినవ్వుతూ మళ్ళీ గోచీ పెట్టుకోబోయాను. వేళ్ళు కొరికింది. విదిలించుకొని అవతలకు

జరిగాను. నా అవస్థ చూస్తూ కూడా కదలక మెదలక, రోలులాగా కూచుంటి పిల్ల తల్లి. పాపం! పొట్టతో, కదలలేని ఆ తండ్రే తాబేలును మరోగదిలో వేసి తలుపువేసి వచ్చాడు. ఈ గొడవలో పిల్ల ఏం పాడిందో కూడా సరిగా వినలేదు. ఏదో బాగానే పాడింది మొత్తానికి, కాని నుడుగు నుడుక్కి ఆయాసపడిపోయింది. పాపం! పొట్లంలాంటి పిల్ల, వాళ్ళమ్మా, నాన్నా, అన్న తమ్ముడూ అంతా గుమ్మటాల్లా వున్నారామె. అదేం చేస్తుందీ. ఇంతకీ ఒక్కగా నొక్క పిల్ల అయినందువల్ల గారాబంగా పెంచారు. పెరిగింది. శరీరం దేవుడిచ్చేది; వద్దంటే పోతుందా! మనవాడేమో 'పిల్లలావు, తల్లి లావు, తండ్రి లావు—ఆ కుటుంబమే లావు; నా కొ'ద్దంటున్నాడు. వాడి భయం-పెళ్ళికాకముందే యింతలావయితే, పెళ్ళయాక వాళ్ళ తల్లిసైజుకు వస్తుందేమోనని. వీడి చాదస్తం మరీ మితిమీరిపోయింది. వీడే పెళ్ళికూతురు కంటే అన్యాయంగా తలవంచుకొని కూచున్నాడు. వీడు పిల్లను చూడలేదు. ....పిల్లే వీడిని చూసింది....ఆ తాబేలుదెబ్బతో వాడికి మతిపోయింది. పిల్ల పాట వినడం మానేసి ఆ మెట్టతాబేలు మళ్ళీ ఎక్కడ కొరుకుతుందో అని వాడి చూపంతా చుట్టుపక్కల తిరుగుతున్న తాబేలుమీదనే వుండింది. 'పోనీ మళ్ళీచూస్తావురా' అన్నాను, మర్నాడు తీసికెళ్దామని. రానన్నాడు. పిల్లకూడ కాస్త వెచ్చచేసింది. దడుపుజ్వరం అనుకొంటాను. ఈ వూరిలో దడుపు మంత్రం చెప్పి యంత్రం వేసే సాయిబు వున్నాట్ట. వేయిద్దామనుకొంటు న్నాను, ఈ రోజు. మనవాడు కాస్త మకారుచేస్తున్నాడు, పిల్లవిషయంలో. కాని పిల్లది నిక్షేపంలాంటి వంశం. బాగా డబ్బున్నవాండ్లు. అన్నిమర్యాదలూ చేయగలరు. పిల్లకూడ తెల్లగా, లక్షణంగా వున్నది—లావుతప్ప. పిల్ల మనింటికి వస్తూనే పనిమనిషిని తీసేస్తే సరి, బుస్సున తగ్గిపోతుంది. ఆ సంగతి నేను చూసుకొంటాను. వీలయితే ముహూర్తం నిశ్చయించుకొనే వస్తాను. మిగతా విషయాలన్నీ సమక్షంలో—

ఇంతే, ఆశీర్వచనములు.''

రెండ్రోజుల తర్వాత మా అత్తగారూ, వెంకటేశం బండి దిగారు. వెంకటేశం లంఖణాలు చేసిన వాడివలె కళ్ళు, ముఖంలోతుకుపీక్కుపోయి,

కారుదిగి కాళ్ళుచ్చుకుంటూ లోపలకు వచ్చాడు. హడావిడిగా కారుదిగి వస్తున్న మా అత్తగారి పలకరించాను. నవ్వుతూ, 'వెంకటేశానికి కాస్త దిష్టి తీయాలి — టెంకాయ కర్పూరం తెమ్మన్నారు. తెచ్చాను. దిష్టి తీశారు వెంకటేశానికి.

లోపలికొచ్చి, అన్ని విశేషాలూ వెంకటేశం తల్లితో చెప్పి, అన్నీ అనుకున్నట్టు ముహూర్తం నిశ్చయించుకొచ్చామని చెప్పారు. అదీ 15 రోజుల వ్యవధిలోనే నిశ్చయించుకొచ్చారు. పెళ్ళి పిల్లవూరిలోనే కనుక అన్ని ఏర్పాట్లూ వాళ్ళవే కనుక మన కొంత శ్రమ, ఖర్చు లేకుండా అన్నీ మాట్లాడుకొని వచ్చేశామన్నారు.

"అన్నట్టు మన ఆవు దూడను వేసిందంటే? నేను వెళ్ళేముందు నేడో రేపో వేస్తుందన్నాడే మన మీసాలనాయుడు" అని అడిగారు మా అత్తగారు.

"ఇంకాలేదు. రోజూ అట్టాగే అంటున్నాడు" అన్నాను.

"మనం పెళ్ళికి తర్లి వెళ్ళేలోగా వేస్తే బావుంటుంది. ఎన్నోసార్లుగా ఆవు దూడను వేసేటప్పుడు దానిచుట్టూ తిరిగి ప్రదక్షిణం చేయాలని అనుకొంటున్నా. ఆవు ఈనేటప్పుడు ముమ్మారు ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణం చేసినంత పుణ్యం. ఇప్పటికి రెండుసార్లుగా అది అర్ధరాత్రి దూడను వేసెయ్యడమో, నేను ఊర్లో లేకుండాపోవడమో జరిగింది. ఈ సారయినా ప్రాప్తముందేమో చూస్తాను" అంటుండగానే —

"పెద్దమ్మగారూ, వచ్చారా! ఆవు ఈ గంటలోనో ఆ గంటలోనో యేస్తది!"

"ఏమిట్రా! పెణ్ణా! దూణ్ణా!"

నాయుడు సిగ్గుపడిపోతూ "దూణ్ణే పెద్దమ్మగారూ!" అన్నాడు.

"సరే! ఈసారయినా, దగ్గరుండి, సమయానికి నన్ను పిలు, ప్రదక్షిణ చేయాలి" అంటూ మా అత్తగారు స్నానానికెళ్ళారు.

ఆవిడటు వెళ్ళగానే — గొడ్లకొట్టంలోంచి—'ఓ పెద్దమ్మగారోయ్! ఓ పెద్దమ్మగారోయి!' అంటూ కేకేశాడు మీసాలనాయుడు. ఏమిటో నని పరిగెత్తాను. మీసాలనాయుడు సంతోషపడిపోతూ,—"మీకాడ ఆవ్వొం! ఇదిగో! నెప్పులు పడతావుంది! కాస్సేపట్లో ఏస్తది దూణ్ణి! పెద్దమ్మగా రేడుండారమ్మా! అదేదో సెయ్యాలన్నారే ఆవుకాడ!...."

"ఆ భూప్రదక్షిణం కాబోలు, సరే పిలుస్తానుండు" అంటూ, బయటి నుండే, స్నానంచేస్తూన్న మా అత్తగారితో—

"అత్తా, ఆవు దూడ వేస్తోంది. మీతో చెప్పమన్నాడు మీసాల నాయుడు" అని గట్టిగా అరచి చెప్పాను.

"ఇదిగో, వచ్చేశాను. కాస్త ఆగమను" అన్నారు మా అత్తగారు, లోపలే హడావిడి పడిపోతూ! బయటి కొస్తూనే "పిల్లను చూసొచ్చిన వేళ మంచిదేనే! మంగళకరంగా ఆవు ఈరోజే దూడను వేస్తోంది. త్వరగా పసుపు, కుంకుమ తీసుకురా! ఈ సమయంలో గోమాతచుట్టూ ప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణం చేసినంత మహాపుణ్యాం దొరకాలే గాని" అంటూ, ఆయాసపడిపోతూ, చీర ఆదరా బాదరా చుట్టుకొని గొడ్ల కొట్టంవేపు పరి గెత్తారు. నేను పసుపు కుంకుమ వగైరా తీసుకొని వెంబడే పరిగెత్తాను.

పాపం! ఆవు ఒకచోట నిలబడకుండా ఈ మూలకూ ఆ మూలకూ మెలికలు తిరుగుతోంది నెప్పులు పడుతూ! నేను తీసికెళ్ళిన పసుపు, కుంకుమ అంతా దాని ముఖానికి అలంకరించి దానిచుట్టూ ప్రదక్షిణం చేయా లని మా అత్తగారి సంకల్పం. ఆవు మామూలుగా సాధువే అయినా నెప్పులు పడే సమయంలో దాని మూడ్ ఎట్లా వుంటుందో తెలియదు. దాని పరిస్థితి చూస్తే ఎవ్వరినీ దగ్గరకు రానిచ్చేటట్లుగా లేదు.

రెండుసార్లు మా అత్తగారు ఆవు దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నిం చారు. కొమ్ములతో దూరాన్నుంచే విదిలించింది. "హై! కళ్ళు కనబళ్ళా, ఎవరనుకున్నావు? పెద్దమ్మగారు. జరు గటు!" అని ఆవు నదిలించాడు మీసాలనాయుడు. కొమ్ములతో నాయుడిని కూడా విదిలించేసింది ఆవు, దాని

బాధలో. "పోనీలే, పసుపు కుంకుమా అవసరంలేదు—అది పడే బాధలో యివన్నీ చేయించుకోటం కూడా కష్టమే!...ఆడజన్మ ఎత్తాక యీ బాధ గొడ్డుకయినా మనిషికయినా తప్పనిసరి కదా! ఒట్టి ప్రదక్షిణాలుచేస్తే చాల్లే" అన్నారు మా అత్తగారు.

ప్రదక్షిణాలు చెయ్యటానికి తిరిగేందుకు వీల్లేకుండా చుట్టూ తడికెలు, ఒకవైపు పిట్టగోడలా అడ్డుంది. మామూలుగా అది అసలు దూడల్ని కట్టేసేచోటు. అప్పుడప్పుడు పాలు అక్కడ కట్టేవాడు మీసాలనాయుడు. అయినా మా అత్తగారు తొట్టిప్రక్క కొంత చోటుంటే ఆ చోటులోనే ప్రదక్షిణాలు చేయడానికి నిశ్చయించారు. నన్నుకూడా రమ్మన్నారు ప్రదక్షిణాలకు. ఆ సమయంలో ఆవు పరిస్థితి చూస్తే ఆ పరిసరాలకు వెళ్ళే ధైర్యం కలగలేదు నాకు. "ముందు మీరు చేయండి. తర్వాత నేను చేస్తాను" అంటూ పసుపు కుంకుమ డబ్బాలు లోపల పెట్టే సాకుతో లోపలికి వచ్చేశాను.

అంతే! కొట్టంలోంచి దభీమని శబ్దం వినిపించింది. ఆవు దూడను వేసిందేమోనని పరుగెత్తాను. మా అత్తగారు కన్పించలా. "అయ్యోయమ్మో! రాండమ్మో! చిన్నమ్మగారూ! తొరగా రాండి! పెద్దమ్మగారు ప్రదక్షిణం సెయ్యబోతే, ఆవు ఒల్లుతెలవకుండా, తొట్లోకి తోసేసింది" అంటూ కొడవటి పిడంత మీసాలనాయుడు, మా అత్తగార్ని పట్టుకోవడానికి భయపడి, తొట్టి చుట్టూ గిరగిరా తిరుగుతూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. నేను గబగబ వెళ్ళి చూస్తే మా అత్తగారు మునుగుతూ తేలుతూ, తొట్లో పాచిపుంటుంవలన చేయి ఊతం దొరక్క, లేవడానికి తంటాలు పడుతున్నారు. వెంటనే ఆమె రెండు భుజాలక్రిందా నా రెండుచేతులూ పూతంయిచ్చి ఆమెను లేవదీయడానికి ప్రయత్నించాను. కాని తొట్లోవున్న పాచి మా అత్తగార్ని విడిచి పెట్టలా. కొంతవరకు లేచి చేయిజారి, మళ్ళా నీళ్ళల్లో పడ్డారు. తొట్లో అంతపాచి వుందని అంతవరకూ తెలేని మా అత్తగారు మీసాలనాయుడివేపు గుర్రుగా చూశారు...అది గ్రహించిన నాయుడు "తొట్లో పాసి వుంటేనే

గొడ్లు తాగే నీళ్ళు లేటగుంటయి.... యీ సంగ తెలిస్తే తొట్టి సుబ్రంగా కడిగేవాణ్ణి గద....'' అని గొణిగాడు, దొంగచూపులు చూస్తూ.

ఈ గొడవలో ఆవు దూడను ఎప్పుడు వేసిందో ఏం చూడలా.... కింద పడివున్న దూడను ఆప్యాయంగా నాకుతూ ఒళ్ళంతా శుభ్రం చేస్తోంది ఆవు.... ''ఏసింది అమ్మగారూ, ఏసింది'' అని సంతోషపడిపోతూ ఆవుదూడ దగ్గిరికి పరుగెత్తాడు మీసాలనాయుడు.... మా అత్తగార్ని, ఎలాగో తంటాలుపడి, లేవదీసి తొట్టిబయటికి దింపాను.... అప్పుడొచ్చాడు వెంకటేశం హడావిడిపడుతూ. చెయ్యి విరిగినంత నొప్పిగా వుందని మా అత్తగారు బాధపట్టం చూసి డాక్టరుకోసం పరుగెత్తాడు వెంకటేశం. డాక్టరొచ్చి ఆమె చెయ్యి మణికట్టు ఎముక కొద్దిగా బెసికిందని, ఒక నెలరోజులైనా కనీసం కట్టుకట్టి వుంచాలని, పెద్దతనం గాబట్టి చాలా భద్రంగా చూడాలనీ చెప్పి వెళ్ళాడు.... ''ఇదేం ఖర్మమే, వెంకటేశం పెళ్ళినాటికైనా నా చెయ్యి బాగుపడితే బాగుండు.... పుణ్యానికి పోతే పాపం ఎదురైంది'' అంటూ వాపోయారు మా అత్తగారు.... భూప్రదక్షిణం సంగతి ఎవరికీ చెప్పద్దన్నారు.... నేను గంభీరంగా వూరుకున్నాను.

పెళ్ళినాడు పెళ్ళికూతురుకు మా అత్తగారే స్వయంగా ముస్తాబు చేయించాలన్నారు. వెంకటేశం తల్లి పాత నగలన్నీ ఒక్కొక్కటే బయటికి తీసి మాచేతికిచ్చారు—వడ్డాణం పెట్టడానికి పెళ్ళికూతురు నడుం కోసం వెతికాం.... చిక్కలా. పిల్లను ఒక్కసారి నిలువునా చూసి, మధ్య భాగం నడుం అని తేల్చి వడ్డాణం తగిలించబోయాం.... సగం చుట్టుకుకూడా రాలేదా వడ్డాణం.... మెళ్ళో గొలుసు భూగోళంలా వున్న పిల్ల తలనుండి దిగి మెడదాకా వెళ్ళలేదు.... మధ్యనే స్టకప్ అయింది.... యింక పంకీలు ముంజేయి దాటలేదు.... వుంగరాల మాటేమిటి!—మా అత్తగారు లో లోపలే నిరుత్సాహపడిపోయారు.... అయినా 'యివన్నీ పాతనగలర్రా. యీ కాలం ఫ్యాషన్‌వి గావు, కొత్తవి చేద్దాంలే' అంటూ మర్యాదగా మళ్ళీ నగలన్నీ పెట్టెలో పెట్టారు....

పెళ్ళిపీటలమీద కూర్చున్న వధూవరులను చూసి చాలామంది ముఖాలు పక్కకు తిప్పుకుని గుసగుసలాడుకుంటూ నవ్వుకోడం చూశాను-

ఎవరో ఒకావిడ పక్కనున్నావిడతో అంటంకూడా విన్నాను- పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ రమణారెడ్డీ, సూర్యకాంతంలా వున్నారని.

మంగళసూత్రం కట్టడానికి లేచి నిలబడ్డ వెంకటేశం కెవ్వుమని కేకేసి పురోహితుడి రెండుభుజాలూ పట్టుకున్నాడు వెంకటేశం చేతిలో వున్న మంగళసూత్రాలు పురోహితుడి మెడలో పడ్డాయి. పురోహితుడి మెళ్ళో మంగళసూత్రాలు చూసి 'యిదేమిటి' అంటూ పెళ్ళిపందిట్లో జనం అంతా ఖంగారుపడుతూ వెంకటేశం చుట్టూ గుంపుగూడారు. భయంతో ఒణికి పోతున్న వెంకటేశం చుట్టూవున్న జనాన్నిచూసి సిగ్గుపడిపోయాడు— తల ఎత్తకుండానే తనుకూర్చున్న పీటవైపు చేయిచూపించాడు........ పెళ్ళికూతురు పెంచిన తాబేలు.... పీటకిందనుంచి వచ్చి వెంకటేశం కాలు కొరికి పట్టుక్కూర్చుంది. ఒక్కసారి పెళ్ళిపందిరంతా ఘొల్లుమని నవ్వుల్లో మునిగిపోయింది. మా అత్తగారికి ఒళ్ళు మండిపోయింది.

హడావిడిగా గుంపులోంచి పెళ్ళికూతురుతండ్రి వచ్చి "నువ్వెక్కడ దాపురించావే మా ప్రాణానికి" అంటూ తాబేల్ను నాలుగుతిట్టి లోపలికి తీసు కెళ్ళాడు. "ముహూర్తం మించిపోతోంది. మంగళసూత్రధారణ కావాలి" అంటూ పురోహితుడు కేకేశాడు ఇంక ఆ పీటమీద కూర్చోనన్నాడు వెంకటేశం. వేరేపీట తీసుకొచ్చి వేశారు. తల వంచుకొని ముసిముసినవ్వులు నవ్వుకుంటున్న పెళ్ళికూతురు పక్కన అవమానంతో బాధపడుతున్న వెంకటేశం ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.

ఎలాగో తల వంచుకుని పిల్లమెళ్ళో మూడుముళ్ళూ వేశాడు వెంకటేశం. "ఇదేం ముద్దమ్మ. విపరీతం మద్దు! నేనెక్కడా చూళ్ళేదు. ఆ రోజు పెళ్ళిచూపుల కొస్తే వాడి కాలు కొరికి గాభరాపెట్టింది. యీ రోజు శుభమా అంటూ పెళ్ళిపీటలమీద కూర్చుంటే యిక్కడకూడా ఏమి టీపీడా! ....దీని వాలకం చూస్తే, రేపు పిల్లతోసహా యిదికూడా వచ్చేట్టుంది కాపరానికి" అంటూ పక్కనున్న వాళ్ళదగ్గిర మా అత్తగారు సణుక్కోడం పెళ్ళికూతురు విన్నది. ఒకసారి పక్కకు తిరిగి మా అత్తగారివైపు చుర్రున చూసింది.

వెంకటేశానికి ఆ యింట్లో ఏ మూల చూసినా మెట్టతాబేలు కనిపిస్తున్నట్టనిపిస్తోంది. భోజనానికి పీటమీద కూర్చోనని మొండికేశాడు. ప్రత్యేకంగా టేబులుమీద వెంకటేశానికి భోజనం ఏర్పాటు చేయించాడు పెళ్ళికొడుకు తండ్రి. అప్పుడుకూడా కుర్చీమీద కాళ్ళు రెండూ పైకిలేపుకుని బాసింపెట్టు వేసుక్కూర్చున్నాడు. వెంకటేశం పరిస్థితి పెళ్ళివాళ్ళందరికీ వేళాకోళంగా తయారయింది.

శోభనంరోజు రాత్రి పెళ్ళికూతుర్ని వాకిలి పట్టుకుండా అలంకరించి గదిలోకి పంపడానికి తీసుకొచ్చారు అమ్మలక్కలు. బిగుపుచేస్తున్న పెళ్ళికూతుర్ని బలవంతంగా గదిలోకి నెట్టి తలుపులు బిగించి బయట గడియ వేశారు. లోపల్నుంచి కెవ్వుమని కేక వినిపించింది. మరుక్షణం గది తలుపులు దబదబ బాదడం వినిపించింది. అమ్మలక్కలంతా హడలిపోయి ఖంగారు పడుతూ గది తలుపులు తెరిచారు.... ఒక్క వూపుతో బాణంలా దూసుకొచ్చి బయటపడ్డాడు వెంకటేశం.... "ఏమైందేమైంది!" అంటూ అమ్మలక్కలంతా హడావిడి పడుతూ గదిలో కెళ్ళి చూచారు. ఎట్లా వచ్చిందో-పందిరి మంచంమీద దర్జాగా పడుకునుంది మెట్టతాబేలు! అంతా ఒక్కసారిగా ఘొల్లుమని నవ్వేశారు. పెళ్ళికూతురు ముఖం పక్కకు తిప్పుకుని నవ్వడం మొదలెట్టింది. "యిదేమిటే, వెనక ప్రబంధనాయిక లంతా హంసల్ని, జింకల్ని, చిలకల్ని పెంచి మొగుళ్ళకు సందేశాలు పంపితే నువ్వు మెట్టతాబేల్ను పెంచి మొగుణ్ణి హడలగొట్టుతున్నావ్!-గట్టిదానివేనే" అంటూ పెళ్ళికూతురు బుగ్గలు పొడిచారు అమ్మలక్క లంతా.... "దీన్ని ఎంత భద్రంగా గదిలోవేసి తలుపులు గడేసొచ్చినా అమ్మాయి ఎక్కడుంటే అక్కడికి ఎట్లా వస్తుందో వస్తుంది మరి! పాపం! అల్లుడుగారు దీన్నిచూచి హడలెత్తి పోతున్నాడు.... పానకంలో పుడకలాగా మధ్య దీని గొడవ ఎక్కువైంది...." అని విసుక్కుంటూ పెళ్ళికూతురు తల్లి తాబేల్ను గదిలోంచి తీసుకెళ్ళిపోయింది.

వెంకటేశం కోసం వెతికాం.... కనిపించలా.... యిల్లంతా వెతికితే, చివరకు, విడిదిగదిలో చెయ్యినొప్పితో మూలుగుతూ పడుకున్న మా అత్తగారి తలవేపు గోడ కానుకుని, బుంగమూతి పెట్టుకుక్కూర్చున్నాడు

వెంకటేశం. మా అత్తగారు అదేపనిగా మెట్టతాబేల్ని తిట్టిపోస్తోంది. వాళ్ళిద్దర్నీ చూస్తే మా అందరికీ నవ్వాగలేదు. ఎంత బ్రతిమాలినా శోభనం గదిలోకి పోనని భీష్మించుకున్నాడు వెంకటేశం. 'తాబేల్ని తీసేశాం, భయం లేదు' అంటూ ఎంతో నచ్చచెప్పారు అమ్మలక్కలు.... ససేమిరా యింక ఆ మంచం ముట్టుకోనన్నాడు.

అమ్మలక్కలంతా ఒకే గోలగా నవ్వటం, వెంకటేశాన్ని ఎగతాళి చెయ్యటం చూసి మా అత్తగారికి ఎక్కడలేని కోపం వచ్చేసింది.... "ఏమిటే మీ గొడవ? వాడసలే భయపడుతూంటే మధ్య మీ గోల ఏమిటి!.... ఎవరికిష్టముంటాయి చెప్పండి, వాడికి అసహ్యం వేస్తోంది.... ఆ పడక తీసేసి వేరే పడక వేయమని ఆ మాట చెప్పడానికి సిగ్గుపడుతున్నాడు బిడ్డ. యీ తాబేలుపీడా యిట్లా తయారవుతుందనుకోలేదు.... దయ్యంలా పట్టుకుంది వాణ్ణి.... ఛీ ఛీ వెధవపీడా" అంటూ చీకాకుపడ్డారు మా అత్తగారు. అమ్మలక్కలంతా తట్టితట్టి పందిరిమంచం మీది పడకంతా మార్చారు. పూలూ, పన్నీరూ మళ్ళీ చల్లి అలంకారం అంతా ముగించేసరికి పదకొండు దాటింది. యింకా భయపడుతున్న వెంకటేశానికి మా అత్తగారే నచ్చచెప్పి గదిలోకి పంపించారు.

పిల్ల కాపరానికి వచ్చేటప్పుడు మెట్టతాబేలు కూడా వస్తుందేమో, ఎంతమాత్రం వీల్లేదని చెప్పారు మా అత్తగారు వచ్చేరోజు. "పిల్లకు పెంచిన మద్దయినా, పిల్లవాడికి అసహ్యం కాబట్టి ఎంతమాత్రం ఆ తాబేలు పిల్ల వెంటపంపడానికి వీల్లే"దని పిల్ల తల్లిదండ్రుల్ని మరీ మరీ హెచ్చరించి వచ్చారు.

"అబ్బే, మాకు మాత్రం తెలీదా! పంపంలెండి.... మీ కా భయమే అక్కర్లేదు ...అమ్మాయి పెంచింది గనక, అలవాటువల్ల, దాన్ని వదిలి ఒక్క క్షణం వుండదు ఆ తాబేలు. అందుకే యింత అవస్థ అయింది. అల్లుడిగారి సంగతి మాకు తెలిసిపోయిందిగా! యిం కెందుకు పంపుతాం" అంటూ హామీ యిచ్చారు కన్యాదాతలు.

పెళ్ళికూతురు కాపరానికి వచ్చిన రోజే నూతన దంపతుల కొక పెళ్ళిఫోటో తీయించాలని మా అత్తగారు సంకల్పించారు. మా పెళ్ళిఫోటో పక్కన వెంకటేశం పెళ్ళిఫోటో కూడా తగిలించిచూడాలని ఆమె కోరిక....

ఆ రోజు సాయంకాలం నాలుగు గంటలకు ఫోటో ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకే పెళ్ళికూతురుకు మల్లె పూలతో నిండుజడ వేయించి, బెనారెస్ చీర కట్టించి, ముస్తాబు చేశాం. వెంకటేశం మామూలు పంచా, చొక్కా వేసుకొచ్చాడు.

"ఛీ ఛీ. యిదేం డ్రస్సురా! యిట్టా ఫోటోలో దిగితే పెళ్లికూతురు పక్కన పీలగా వుండవూ! వెంటనే వెళ్ళి, మీ మామగారు యీ రోజు పంపిన కొత్త సూటేసుకురా; యీవాళ మంచిది గూడా...." అంటూ వెంకటేశాన్ని తరిమారు మా అత్తగారు....అసలు, ఫోటో తీయించుకోడమే యిష్టం లేని వెంకటేశం. గాలి లేక ఉక్కపోస్తున్న ఆ సమయంలో సూటు వేసుకొచ్చాడు, విధిలేక.... యింటిముందు తోటలో రెండు కుర్చీలు వేయించారు, ఫోటోకోసం, నూతన దంపతులు కూర్చోడానికి...."అది చాలా పాతకాలం 'ఫ్యాషన్'. యీ కాలంవాళ్లంతా 'స్టయిల్' గా నిలబడడమే 'ఫ్యాషన్'. కాబట్టి కుర్చీలు తీసేయం"డన్నాడు ఫోటోగ్రాఫర్— "కాస్త స్టయిల్‌గా పోజిచ్చి నించో బావా".... అంటూ సలహా యిచ్చాడు పెళ్ళి కూతురు అన్న ...

బుట్టబొమ్మలాగా పక్కన నిలబడున్న పెళ్లికూతుర్ని చూచి నిరుత్సాహపడిపోయిన వెంకటేశం నీరసంగా నిలబడ్డాడు....

"అదేంటి బావా ! సూటేసుకుని చేతులలా వేళ్ళాడేసి నిలబడితే ఏం బావుంటుంది.... న్యాచురల్‌గా ఏదైనా పోజిచ్చి నిలబడు...." అన్నాడు మళ్ళీ బావమరిది.

"అప్రన్నా ! అట్టా దిగాలు పడతావేం ! దర్జాగా నిలబడు" అంటూ మా అత్తగారు కాస్త హుషారుగా ముందుకొచ్చారు....

లేని ఉత్సాహం తెచ్చుకొని, న్యాచురల్‌గా నిలబడి, కోటుజేబులో చేయి పెట్టాడు వెంకటేశం.... మరుక్షణం కెవ్వున కేకేసి, రెండు చేతులూ

పైకెత్తి ఎగరడం మొదలెట్టాడు.... అందరం అయోమయంగా చూశాం.... తక్షణం వెంకటేశం కోటుజేబులో నుంచి 'నేనే' అన్నట్టు తొంగిచూసింది మెట్టతాబేలు....

నెమ్మదిగా జేబులోంచి బయటికొచ్చి కోటుమీద పాకుతున్న తాబేల్ని చూసి వెంకటేశానికి, భయంతో, మతిపోయింది.... కేర్‌బార్ మంటూ గంగ వెర్రులెత్తినట్లు, ఒకచోట నిలవకుండా, చేతులు పైకెత్తి నాలుగు వేపులకూ పరుగెత్తడం మొదలెట్టాడు వెంకటేశం. ఏం చేయాలో ఎవరికీ తోచక గుడ్లప్ప చెప్పారు.... మా అత్తగారు కోపంతో ఒణికిపోతున్నారు.... తాబేలు వెంకటేశం భుజం మీదికి పాకుతోంది.

''దాన్ని తీసేయండి.... చచ్చిపోతా.... కోటు పీకేయండి.... తీసేయండి....చచ్చిపోతా....'' అంటూ పిచ్చిపిచ్చిగా కేకలేస్తున్న వెంకటేశాన్ని వాటేసుకు పట్టుకుని, భుజం మీదికెక్కి చెవు కొరకడానికి ప్రయత్నిస్తున్న మెట్టతాబేల్ని తీసి నేలకేసి కొట్టాడు, కసికొద్దీ, పెళ్ళికూతురు అన్న. వెంటనే ఒంటిమీదున్న కోటును గొంగళి పురుగును తీసేసినట్టు లాగేసి మైలు దూరానికి గిరాటేశాడు వెంకటేశం....

''అయ్యో! చచ్చిపోయినట్లుందన్నయ్యా....'' అంటూ పెళ్ళికూతురు తాబేల్ని చేతుల్లోకి తీసుకొంది ఆప్యాయంగా. ఆ దృశ్యం చూసి మా అత్తగారికి ఒళ్ళు మండిపోయింది. అవమానంతో ఇంక అక్కడ ఉండలేకపోయాడు వెంకటేశం. తల వంచుకొని లోపలికి పరుగెత్తాడు— విఘ్నేశ్వరుడి కాళ్ళదగ్గిర ఎలుకలాగా పెళ్ళికూతురు కాళ్ళదగ్గరున్న తాబేల్ని చూసి, అంతవరకూ నవ్వు ఆపుకున్న ఫోటోగ్రాఫర్‌తో సహా అందరికీ ఒక్కసారిగా నవ్వొచ్చింది.

''చాల్లే, నవ్వారు.... పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకటంలా తయారయిందీ పీడా! గృహప్రవేశానికొస్తూ గుడ్లగూబను వెంటేసుకొచ్చినట్టు దీన్నికూడా తెచ్చుకున్నారన్నమాట.... ఒచ్చినంత దూరం చెప్పానే తేవద్దని.... ఛీ!ఛీ! మనిషి కొకమాట....'' అని మా అత్తగారు ఇంకా ఏదో అనబోతుండగానే పెళ్ళికూతురు అన్న అడ్డొచ్చాడు.

"మీరలా అపార్థం చేసుకోకండి.... మేం తేలేదు దాన్ని. జరిగిన సంగతి వినండి...."

"ఆ, ఇంకా ఏం వినేది.... శుభమా అంటూ ఏది తలపెట్టినా రసాభాసు చేస్తోంది ఈ దరిద్రప్పీడా తాబేలు.... దాన్ని వదిలి ఈమె లుండలేదు. ఆమెని వదలి అదుండలేదు.... ఎందుకీ అబద్ధాలు!"

మా అత్తగార్ని చుర్రున చూసింది పెళ్ళికూతురు.

"అయ్యయ్యో! మీరంత మాట అనొద్దు. చూస్తూ చూస్తూ దాన్ని చంపలేక పోతున్నాం. పాపం అని. లేకపోతే మాకు మాత్రం కష్టంగా లేదా చెప్పండి.... ఒచ్చేముందు దాన్ని మా రూములో పడేసి జాగ్రత్తగానే తలుపేశాం.... కాని, అనుకోకుండా, ముందురోజు టైలర్ తెచ్చిచ్చిన బావగారి సూటు ఆ గదిలోనే పెట్టెమీద ఉండిపోవడం.... అది మేం వచ్చే హడావిడిలో గమనించక పోవడంవల్ల పొరపాటు జరిగింది...." అంటూ ఎంతో వినయంగా మా అత్తగారికి చెప్తున్న పెళ్ళికూతురు అన్నను చూస్తే అయ్యో పాపం అనిపించిది....

"అమ్మో, ఎండ పోతోంది...." అంటూ ఫోటోగ్రాఫర్ ఫోటో సంగతి గుర్తు చేశాడు.

"పోనీ పంచా, చొక్కాతోనైనా రారా! ఎండ పోతోందట ఫోటో తియ్యడానికీ...." అంటూ కేకేశారు మా అత్తగారు.... బయటికి రావడానికి సిగ్గుపడి లోపలే కూర్చున్న వెంకటేశం "నాకు ఫోటో ఒద్దు...." అన్నాడు....

"అదేమిట్రా శుభమా అంటూ పెళ్ళి ఫోటో ఒద్దంటావు!.... ఏమో నబ్బా! ఆ పీడా తాబేలు వున్నంతవరకూ ఏదీ సరిగ్గా ముడిబడేట్టు లా... పైగా ఇట్టా ఒళ్ళో కూర్చోబెట్టుకుంటా వేమిటా పీడాకారాన్ని, అసహ్యంగా.... అందుకే నువ్వుగూడా వాడి కంటికి తాబేల్లాగా కనిపిస్తున్నట్టున్నావ్. నీ పక్క నిలబడ్డానికే భయపడుతున్నాడు బిడ్డ...." అన్నారు పెళ్ళికూతురంటే అరికాలి మంటగా వున్న మా అత్తగారు....

"దానికి నేనేం చేసేది! ఎవరి అసహ్యం వాళ్ళది.... మధ్యాన్నం మీరు కుక్కపిల్లను ముద్దు చేస్తుంటే నే చూళ్ళా.... నాకు కుక్కలంటే

అసహ్యం....'' అని యింకా ఏమో అనబోతూంటే.... "అమ్మాయ్! ఏమి టా అధికప్రసంగం!.... పెద్దా చిన్నా వుండక్కర్లా...." అంటూ పెళ్లి కూతుర్ని కోప్పడ్డాడు పెళ్ళికూతురు అన్న. అంతవరకూ ఎప్పుడూ నోరు విప్పని పెళ్ళికూతురు ఒక్కసారి ఫెళ్లున సమాధానం చెప్పేసరికి అదురుదెబ్బ తిన్న మా అత్తగారు బెదిరిపోయి గుడ్లు తేలేసి నావైపు చూశారు.... పిల్ల నోటినుండి అంత పెళుసు సమాధానం వస్తుందని ఎదురు చూడని నేనూ మా అత్తగారి అవస్థలోనే వుండిపోయాను....

"బావను ఫోటోకు పిలవండి.... దీని సంగతి నే చూసుకుంటా" అంటూ, పెళ్లికూతురు చేతుల్లోంచి తాబేల్ని విసురుగా లాక్కుని తోటవైపు చరచర నడిచివెళ్ళాడు పెళ్లికూతురు అన్న....

"దాన్ని చంపకన్నయ్యా.... నాకు [illegible]..." అంటూ వెనకనుంచి పెళ్లికూతురు ప్రాధేయపడింది....

"లేదులే.... బావ ఫోటో తీయించుకున్నదాకా అటువేపు తీసుకెళ్తాను" అంటూ వెళ్లాడు....

"ఈరోజింక లాభంలేదు.... ఎండ పోయింది; లైటు చాల్దు" అన్నాడు ఫోటోగ్రాఫర్, తన కెమెరా అలా పెట్టెలో పెట్టేస్తూ.

"మరీ మంచిదైంది....'' అంటూ విసురుగా లోపలి కెళ్లిపోయింది పెళ్లికూతురు.... మరోకసారి షాక్ తిన్న మా అత్తగారు నావైపుచూసి నిట్టూర్పు విడిచారు.... పెళ్ళిఫోటో ప్రోగ్రాం ఆ విధంగా అయినందుకు అందరం మనసులు నొచ్చుకున్నాం....

ఆ తాబే లున్నంతవరకూ పెళ్లికూతు రున్న ప్రాంతాలకుకూడా వెళ్ళలేదు వెంకటేశం.... గది తలుపులు బిగించుకుని లోపలే కూర్చోవడం మొదలుపెట్టాడు.... మా అత్తగారి మాటలకు అప్పటికే మనసు గాయపడ్డ పెళ్ళికూతురు అన్న ఆరోజురాత్రే ప్రయాణమైనాడు, తాబేలుతో సహా.

మెట్టతాబేలు వదిలితే చాలని ఎదురు చూస్తున్న మా అత్తగారు, మాట వరసకైనాకూడా, వుండమని బలవంతం చేయలేదు.

"ముందా మెట్టతాబేల్ను భద్రంగా మీ యింటికి చేర్చుకో నాయనా.. ఒచ్చేముందు మరిచిపోయినట్లు మరచిపోయేవు–" అంటూ హెచ్చరించారు మా అత్తగారు ప్రయాణ మౌతున్న పెళ్లికూతురు అన్నతో....

"అబ్బే...యీ సారి అలాంటి పొరపాటు జరగదులెండి..." అంటూ మా అత్తగారి ముందే తాబేల్ను ఒక సంచిలో వేసి గట్టిగా కట్టేశాడు.... ఆ ఘోరం చూడలేక పెళ్లికూతురు కండ్లు తుడుచుకుంటూ తన గదిలో కెళ్ళింది....

కారుసీట్లో తనపక్కనే తాబేలున్న సంచినికూడా పెట్టుకూర్చుని అందరికీ 'వెళ్లొస్తా'నని చెప్పాడు. తాబేలున్న ప్రాంతాలకు రాడుగనుక బయ ల్దేరేముందే బావకి 'వెళ్ళొస్తా'నని చెప్పాడు....తాబేలు పుట్టింటికి వెళ్ళి పోయింది....

* * *

అబ్బ! ఒదిలింది తాబేలుపీడా...యింక మొగుడూ,పెళ్లాం ఒద్దిగ్గా ఒకచోట వుండొచ్చు.... అనుకుని సంతోషపడ్డాం....

తాబేలు వెళ్ళిపోయిన మర్నాడు ప్రొద్దుటే వెంకటేశం ముఖంలో కళ కనిపించింది....అన్నా, తాబేలూ-యిద్దరూ వెళ్ళిపోయినందుకు దిగుల్తో ముఖం వేళ్ళాడేసుకున్న పెళ్ళికూతుర్నీ, వెంకటేశాన్నీ ఏ బీచికో, సినిమాకో పంపితేగాని తాబేలు గొడవ మరిచిపోరనే ఉద్దేశంతో మా అత్తగారూ, నేనూ ప్లాన్ వేశాం.

"అట్లా బీచీకో, సినిమాకో వెళ్ళిరండర్రా మీ రిద్దరూ" అన్నారు వెంకటేశంతో మా అత్తగారు....

"ఊహూ....నే వెళ్ళను...."అన్నాడు వెంకటేశం.

తాబేలు గొడవ కాసేపు మరిచిపోయి ఖులాసాగా అట్లా తిరిగిరమ్మనీ, లేకపోతే పిల్ల దిగులేసుకుంటుందనీ, గోరంతను కొండంత చేయొద్దనీ మా అత్తగారు నచ్చచెప్పిం తర్వాత,

"అయితే నువు కూడా రా మాతో...." అన్నాడు వెంకటేశం....

"నే నెందుకు.... దానివెంట తాబేల్లాగా నీ వెంట నేనెందుకూ మధ్య" అంటూ కోప్పడ్డారు మా అత్తగారు....,

"అయితే నేను....నేను....ఒంటరిగా వెళ్ళను...." అన్నాడు అసలు పెళ్ళికూతుర్నే తాబేలురూపంలో ఊహించి హడలెత్తిపోతున్న వెంకటేశం. విధిలేక నూతన దంపతుల వెంట మా అత్తగారి బలవంతంమీద నేనూ వెళ్ళాల్సి వచ్చింది బీచీకి....కార్లో పెళ్ళాం పక్కన వెంకటేశాన్ని కూర్చోబెట్టడానికి మాకు తలప్రాణం తోక్కొచ్చింది....వెనకసీట్లో వెంకటేశం దంపతులతో పాటు నేనూ కూర్చున్నాను. ముందుసీట్లో మా అత్తగారు మాత్రం కూర్చున్నారు....బీచీలో కారు మెల్లిగా పోతోంది....చల్లటి సముద్రంగాలి మూతిముడుచుకూర్చున్న కొత్త దంపతులకు గిలిగింతలుపెట్టి యిద్దరి కోపతాపాలూ పోగొడుతుం దనుకున్నాను....

ఉన్నట్టుండి కెవ్వున కేకేసి కారుతలుపు తెరిచి దభీమని కిందికి దూకాడు వెంకటేశం....

సడన్‌బ్రేకు వేయడంతో అందరం ముందుకుపడ్డాం....ఒక్కసారిగా మా గుండె లాగిపోయినట్లనిపించింది.... వెనకవచ్చే కార్లన్నీ 'సడన్' బ్రేకుతో కీచుమని శబ్దం చేసుకుంటూ ఆగాయి....వెనక్కి తిరిగి చూశాను. వెంకటేశం పడ్డచోట జనం చేరార.... ముందుకుపడ్డంలో తలకు కాస్తదెబ్బ తగిలిన మా అత్తగారు తెప్పరిల్లి, వెంకటేశంకోసం ఖంగారుపడుతూ కారు దిగి గుంపుచేరినచోటికి పరుగెత్తారు. ఆమె వెనకాలే డ్రైవర్‌కూడా పరుగెత్తాడు. నాకు సడన్‌గా అనుమానం కలిగి పెళ్ళికూతురుపక్కన వెంకటేశం కూర్చున్న చోట్లోకి తొంగిచూశాను.... నా కండ్లను నేనే నమ్మలేకపోయాను....మెట్టతాబేలు....సీటు వెనుకనుంచి వచ్చి వెంకటేశం తొడ కొరికినట్లుంది....దర్జాగా పెళ్ళికూతురు పక్కన కూర్చుంది.... ....యింక దీన్నేం చేయడం!.... పెళ్ళికూతురు ఓవైపు కండ్లనీళ్ళు పెట్టుకుంటూనే మరోవైపు దాన్ని చూసి నవ్వుతోంది....మా అత్తగారు చూస్తే ప్రమాదమే!.... వెనక్కి తిరిగి చూశాను....వెంకటేశం లేచి నిలబడి మోకాళ్ళూ మోచేతులూ దులుపుకుంటూ మా అత్తగారితో ఏదో చెప్పి, ఆమె యింకా ఏమో చెపుతున్నా వినిపించుకోకుండా గబ గబ బీచీ ఇసకలోకి నడిచివెళ్లాడు....మా అత్తగారు ఒక్క వూపులో కారు దగ్గిరి కొచ్చారు.

''సరేకాని! నీ కిదేంబుద్ధి! ఎంత పెంచిన ముద్దు అయినా నీ [illegible] కిష్టం లేదన్న తర్వాతకూడా దాన్ని వదిలిపెట్టనంటావేం! అన్న[illegible] [illegible] నట్టే పంపి, కార్లో వదలి వెళ్ళమన్నావా!....ఛా ఛా. ఎరక్క [illegible] గొంతు కోశాను....యిటువంటి దొంగబుద్ధులుండే మనుష [illegible]'' అని ఒళ్ళుతెలీని కోపంతో మా అత్తగా రంటూంటే....

"తొందరపడి మాటలు మిగలకండి.... నేను వుంచమని చెప్పనూ లేదు. మా అన్నయ్య దాన్ని వుంచి వెళ్ళనూ లేదు....అది ఎలాగో తప్పించుకుని కార్లోనే వుండిపోయింది....అన్నయ్య చూసుకోనుండడు....ఎవరు తీసి కెళ్ళినా అది నన్ను వదలి ఓపళంగా వెళ్ళదు" అన్నది పెళ్ళికూతురు కంద్లు తుడుచుకుంటూ....

''ఓహో, బాగానేవుంది వరస....తెలీకడుగుతాగానీ, నీకు మొగుడు కావాలా, ఆ తాబేలు కావాలా ! పోనీ అదైనా తేల్చిచెప్పు'' అంటూ మా అత్తగారి కంఠస్వరం పెరగడంతో నాకు ఖంగారు పట్టుకుంది.

నలుగురూ వచ్చీపోయే వీధీరోడ్డులో వాళ్ళిద్దరూ ఘర్షణపట్టం నాకు నచ్చలేదు .... ....

''అత్తా, మీరు కార్లో కూర్చోండి — యింటి కెళ్ళి మాట్లాడుకో వచ్చు'' ........ అన్నాను.

''యింకా చూస్తూ చూస్తూ ఎట్లాగే యీ తాబేలు పీడాని యింటికి తీసుకెళ్ళడం!....యిక యిదుండంటే వాడు యింటికికూడా రాడు....వాడి కెంత భయం, అసహ్యం లేందే అట్లా ప్రాణాలకు తెగించి కార్లోనుంచి దూకుతాడు!....ఇంగితం వుండక్కర్లా!....కారు నెమ్మదిగా పోతోంది గనక కాస్తలో గండం తప్పింది....లేకపోతే ఏమయ్యుండేది ! .... అసలు వాళ్ళ అమ్మా నాన్నావాళ్ళ నొచ్చి సంగతేమిటో తేల్చుకోమని చెప్తాను.... యిక వూరుకుంటే లాభంలేదు....'' అంటూ ముందుసీట్లో కూర్చొని తలుపు విసురుగా లాగి వేసుకోడంలో మా అత్తగారి ఎడంచేయి తలుపుసందులో వుండిపోయింది..., బయటికి కనిపించకుండా కాసేపు బాధపడ్డారు..., కోపంతోనూ,

అవమానంతోనూ లోపల్లోపలే ఉడికిపోతున్న పెళ్ళికూతురు తనపక్కనున్న తాబేల్ని తలుపు తీసి, కసికొద్దీ, రోడ్డుమీదికి విసిరికొట్టి, రెండుచేతుల్తోనూ ముఖం కప్పుకుంది.... ఓవైపునుంచి అయ్యోపాపం అనిపించినా అప్పటి పరిస్థితి తలుచుకుని 'బ్రతుకుజీవుడా' అనిపించింది .... ....

"అత్తా, తాబేల్ని పారేసింది.... యిక మనం యింటికెళ్ళొచ్చు".... అన్నాను.

చేయి నొప్పితో బాధపడుతూన్న మా అత్తగారు 'ఊ.... సంతోషం' అన్నారు వెనక్కి తిరిగి చూడకుండానే.... కారు కదిలింది .... ....

కొత్తదంపతుల ప్రణయకలహాలకు అందరి మనసులూ బాధపడ్డాయి .... ....

ఇంటి కొస్తూనే టేబిల్ మీద టెలిగ్రాం వుండటం చూశాను .... తీరా చూస్తే పెళ్ళి కూతురు అన్న యిచ్చాడు. తాబేలు తప్పించుకుందనీ, చిక్కితే వెంటనే చంపేసేయమనీ........ నవ్వొచ్చింది .... మా అత్తగారికి చెప్పాను టెలిగ్రాం విషయం ........

"అఘోరించలేక పోయాడూ...చవట".... అంటూ విసుక్కున్నారు....

పదిగంటలకు చేతులకూ, కాళ్ళకూ కట్లు కట్టుకుని టాక్సీలోంచి దిగాడు వెంకటేశం.... వెంకటేశం వస్తూనే ఎర్రనీళ్ళు చుట్టి పోయమన్నారు మా అత్తగారు. ఎర్రనీళ్ళు తీసిపోసి, తాబేల్ని బీచీ రోడ్డులోనే పారేసి వచ్చాననికూడా చెప్పాను ........

బాగా అలిసిపోయిన వెంకటేశం, విరక్తిగా, ఒక పొడి నవ్వు నవ్వి కాళ్ళీడ్చుకుంటూ తన గదిలోకి వెళ్ళాడు ....

ఒంట్లో బాగాలేదనీ, పాలూ, ఫలహారం ఏదీ వద్దనీ మూలుగుతూ పడుకున్నారు మా అత్తగారు ....

యింకోవైపు ఆకల్లేదని అన్నం తినకుండా, కండ్ల నీళ్ళు పెట్టుకుంటూ కూచ్చుంది పెళ్ళికూతురు....అదేం బాగాలేదనీ, అట్లా కండ్లనీళ్లు పెట్టుకోడం

మంచిది కాదనీ కాసేపు నచ్చచెప్పి వెంకటేశంతోపాటు పెళ్ళి
కూడా భోజనానికి కూర్చోబెట్టేసరికి తాతలు దిగొచ్చారు ....

రాత్రి పదకొండు గంటల ప్రాంతాల్లో బయట 'పోర్టికో'లో
కారుదగ్గిర "యిదేరా.... యీ కారే".... అంటున్న మాటలు వినిపించాయి.
బయటికెళ్ళి చూస్తే ఎవరో యిద్దరు మగవాళ్లు కారుదగ్గిర నిలబడ్డారు
నంబరు చూస్తూ.... ఎవరూ, ఏమిటీ అని విచారించాను ....

"యిది మీ కారే గదండీ!" .... అన్నారు వచ్చిన వాళ్ళు. అవు
నన్నాను ....

"ఏం లేదు, యిందులోనుంచి యీ తాబేలు కింద పట్టం వెనక కార్లో
వస్తున్న మా ఆఫీసరుగారు చూశారు.... మా కారు ఆపి దీన్ని పట్టుకునేలోగా
మీ కారు చాలా దూరం వెళ్ళిపోయింది.... యింకాస్తయితే లారీకింద పడే దీ
తాబేలు.... అయినా చావ దంటారనుకోండి.... మీ కారు నంబరు నోట్ చేసు
కున్న మా ఆఫీసరుగారు మీ అడ్రసు కనుక్కొని దీన్ని మీ కప్పగించి
రమ్మన్నారు.... యిందండి" అంటూ చేతిలోవున్న తాబేలు సంచిని నా కివ్వ
బోయారు....

చచ్చాన్రా దేవుడా అనుకుని, "కాస్తుండండి, మా అత్తగార్ని కను
క్కోవాలి" అంటూ లోపలికి పరుగెత్తాను. తాబేలు గొడవ వదలిపోయింది
గదా అని సంతోషిస్తూ నూతన దంపతు ల్నిద్దర్నీ మేడమీది గదిలోకి పంపి
పది నిముషాలన్నా కాలేదు.... యిది మళ్ళీ వచ్చిందని తెలిస్తే వెంకటేశం
అక్కణ్ణుంచే దూకుతా డని భయం వేసింది....

మా అత్తగారి చెవులో రహస్యంగా చెప్పాను తాబేలు మళ్ళీ
వచ్చిందని....

మా అత్తగారు చివాల్న లేచి నిలబడ్డారు........ "ఓసి దీన్ని తగ
లెయ్యా!.... యిది మనల్ని ఒదిలేట్టు లేదే! .... యిదేదో దయ్యమేనే........

ఉండు....దీన్నిట్టాగాదు....అన్నట్టు, పిల్ల చూసిందా వచ్చిన వాళ్ళని"....
అన్నారు మెల్లిగా.

లేదన్నాను....

"వెంకటేశం!"

"ఊహూ....వాళ్ళిద్దరూ మేడమీ దున్నారు" అన్నాను.

"అయితే నువ్వు గప్‌చిప్‌గా వూరుకో....గుట్టుగా నేను చేయాల్సిందేదో చేసేస్తాను" అంటూ బయటికెళ్ళి, వాళ్ళదగ్గర్నుంచి తాబేలున్న సంచీ అడిగిపుచ్చుకుంటున్న మా అత్తగారు నాకు భయంకరంగా కనిపించారు....

ఆమె ఏం చేయడానికి సంకల్పించారో గ్రహించాను .... నా ఒళ్ళు జలదరించింది....

మర్నాడు మా అత్తగారికి ఒళ్ళు తెలీని జ్వరం తగిలింది .. గంట గంటకూ జ్వరతీవ్రత ఎక్కువ కావడం మొదలెట్టింది....మా అత్తగారికి ఎప్పుడైనా జ్వరం తగిల్తే పిచ్చిపిచ్చిగా మంగళహారతులూ, అప్పగింతలూ, భజనపాటలూ పాట్టం ఆమె కలవాటు .... కాని యీసారి కొత్తగా కలవరింతలు మొదలెట్టారు....

"అదుగో తాబేలు ...యిదుగో! యిటొస్తోంది....దాన్ని పట్టుకో.... అబ్బో! ఎంత పెద్ద తాబేలే....గుడ్లురుముతోందేవ్! .. ఓయమ్మ! చచ్చానేవ్!...." అంటూ గట్టిగా అరిచి మంచంమీదినుంచి కిందికి దొర్లి పడబోయారు. పక్కనున్న నేను పట్టుకున్నాను....

యిదేమిటీ! .... నాకు ఖంగారు పట్టుకుంది .... నాకంటే భయస్థుడు వెంకటేశం. అప్పుడే వచ్చి వెళ్ళిన డాక్టరు కోసం మళ్ళీ పరుగెత్తాడు.... కాళ్ళదగ్గర కూర్చున్న వెంకటేశం తల్లీ, పెళ్ళికూతురూ అయోమయంగా నావైపు చూచారు....

డాక్టరొచ్చి మరేం భయం లేదనీ, మామూలు జ్వరమేననీ, ఏదో మెంటల్ 'షాక్' వల్ల అట్లా కలవరింతలు వస్తున్నాయనీ, అదేదో ఆమెనే

అడిగి తెలుసుకుంటే, దానికి తగిన ట్రీట్‌మెంట్ ఆలోచించవచ్చునని చెప్పి వెళ్ళిపోయాడు....

డాక్టర్ వెళ్తానే మా అత్తగారు నన్ను దగ్గిరికి పిల్చారు.... చెవులో రహస్యంగా చెప్పారు .... "వెండి తాబేలు ఒకటి వెంటనే చేయించి పూజలో పెట్టాలి.... యీ సంగతి ఎవరికీ తెలీకూడదు...." అన్నారు...ఆమె బాధ గ్రహించిన నేను వెంటనే వెండికొట్టుకు కబురు పంపి మెట్టతాబేలు సైజు వెండితాబేలు చేయమని ఆర్డరిచ్చాను....

'ఏమి టేమి' టని వెంకటేశం తల్లీ, వెంకటేశం అడిగారు.... "ఏం లేదు.... వెంకటేశ్వరస్వామికి ముడుపు కట్టమన్నా" రన్నాను....

సాయంకాలానికంతా జ్వరం తిరుగుముఖం పట్టింది.... ఆఫీసునుంచి వచ్చిన మావారితో మా అత్తగారు మామూలుగా మాట్లాట్టం చూసి నా మనసు తేలికయింది....

ఆ తర్వాత వారం రోజులకంతా వెండి తాబేలు రావడం, మా అత్తగారు దాన్ని పూజలో పెట్టి, దానికో ప్రత్యేక స్థానం యివ్వడం జరిగింది....

వెండి తాబేలు ఎందుకు చేయించాల్సివచ్చిందో అప్పటికీ, యిప్పటికీ నాకూ, మా అత్తగారికీ తప్ప మూడోవాళ్ళకు తెలీదు.... అదొక చిదంబర రహస్యంగా వుండిపోయింది....

మొత్తానికి మా అత్తగారి పూజకు పాత్రమై మా యింటి ఇలవేల్పుల జాబితాలో కెక్కింది మెట్టతాబేలు....